క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన విజయరెడ్డి



రాజమహేంద్రవరంలో మిథున్‌రెడ్డిని కలిసి శాలువా వేస్తున్న విజయరెడ్డి

పెదపూడి: రాజమహేంద్రవరంలో ఎంపీ మిథున్‌రెడ్డిని జి.మామిడాడ గ్రామానికి చెందిన, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే మిథున్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మిథున్‌రెడ్డి చెప్పినట్లు విజయరెడ్డి వివరించారు. ఆయన వెంట జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ నల్లమిల్లి వేణురెడ్డి ఉన్నారు.

వైభవంగా గురుచరిత్ర పారాయణ



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక శిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి నుంచి ప్రారంభమైన గురుచరిత్ర పారాయణ యజ్ఞం వచ్చే గురువారంతో ముగియనుంది. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పారాయణ పది గురువారాలు వైభవంగా పూర్తి చేసుకుంది. తెల్లవారుజామున కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణ ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తి చేశారు. వచ్చే గురువారంతో 11 గురువారాలు పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు.

దసరా ఉత్సవాలకు పందిరిరాట



కొంకుదురులో ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం చేస్తున్న పెద్దలు, భక్తులు

బిక్కవోలు: కొంకుదురులోని గోపాల రామానాయుడు వీధిలో దసరా ఉత్సవాలకు సంబంధించి గురువారం స్థానిక పెద్దలు, భక్తులు పందిరిరాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి చిన్నం శ్రీనివాసురెడ్డి మాట్లాడుతూ గత 66 ఏళ్లగా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా చండీ హోమం, కన్యారాధన, సరస్వతీ పూజ, ప్రతి రోజూ కుంకుమ పూజలు నిర్వహిస్తారన్నారు. సత్తి సుబ్బారెడ్డి, శైలజ దంపతులు యజ్ఞకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న ప్రతినిధులు

రాజానగరం: మండలంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, బిస్కెట్లు, చిక్కీలతో పాటు స్టీల్ ప్లేట్లను మానవతా స్వచ్ఛంద సంస్థ వితరణగా గురువారం అందజేసింది. డొక్కా సీతమ్మ పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు భోజనాలు చేసేందుకు వీటిని వినియోగించాలన్నారు. హెచ్ఎం రమేష్, సంస్థ ప్రతినిధులు బి.మురళీ, మధు, గాంధీ, రుద్రమదేవి, టి.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడులలో 20 లీటర్ల సారా, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని పరారైన వాసంశెట్టి వెంకటరమణపై కేసు నమోదు చేశామన్నారు.

అక్షరాస్యత పెంచాలి

పెదపూడి: వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు ఉల్లాస్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో వయోజనులను నూరు శాతం అక్షరాస్యులుగా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వెలుగు ఏపీఎం అరుణ, ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ, వెలుగు సీసీలు శ్రీను, రమేష్‌బాబు, సూర్యకుమారి పాల్గొన్నారు.

యూరియా.. ఎక్కడయ్యా!

- పంట కీలక దశలో సిగపట్లు
- బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న రైతన్నలు



శ్రీరంగపట్నం సొసైటీ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



కోటిలో కీలక దశలో ఉన్న వరి పంట

కోరుకొండ: ఎరువు బరువైంది.. అన్నదాతకు అందనంత దూరమైంది.. కీలక సమయంలో యూరియా బస్తాల కోసం ఇబ్బంది నెలకొంది. రాజానగరం నియోజకవర్గంలో ఏ మండలంలో రైతును కదిపినా కొందామంటే యూరియా లేదని మాటే వస్తోంది. దేశానికే అన్నం పెడుతున్న రైతన్నలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. యూరియా కొరత ఉన్నా పట్టించుకోకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 16,152 హెక్టార్లు ఉంది. కాగా వరి సాగుకు సుమారు 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. కానీ అవసరం మేరకు యూరియాను అందించకపోవడంతో రైతులు పొలాలను వదిలి సొసైటీల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. ఇటీవల ఎరువుల కోసం శ్రీరంగపట్నంలో రైతులు రాస్తారోకో చేశారు. అలాగే కోరుకొండ సొసైటీ వద్ద ఆందోళన చేపట్టారు. ఇక్కడ రైతుల తొక్కిసలాట కారణంగా సొసైటీ భవనం అద్దాలు ధ్వంసమయ్యాయి. కాండం బలపడే దశలో ఉన్న వరి పొలాలకు ఎరువులు వేయడం కీలకం. పిలకలు వేసే దశలో ఉన్న చేనుకు యూరియా చాలా అవసరం. అయితే ఎరువుల కొరతతో రైతన్నలు కష్టాలు వర్ణనాతీతం.

ప్రకటించి.. పరిహాసం చేసి

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారా యూరియాను అందజేస్తామని ప్రకటించింది. ఎక్కువ భూములున్న రైతులకు సంఘాల అధికారులు ఎక్కువగా యూరియా అందిస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులకు యూరియా అందడం లేదు. నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో 20 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పాలకమండలి సభ్యులు వారి అనుచరులకు ఎక్కువగా యూరియాను అందజేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కలెక్టర్ ప్రశాంతి గాడాల సొసైటీలో తనిఖీ చేయగా, ఒక్కొక్కరికి ఒకటి నుంచి రెండు బస్తాలు ఇవ్వాల్సి ఉండగా, మరింత ఎక్కువ ఇచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. ఎక్కువ ఇచ్చిన వారి నుంచి ఆ బస్తాలను రికవరీ చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. దీనినిబట్టి చూస్తే కూటమి కనుసన్నల్లోనే ఈ పంపిణీ జరుగుతుందని తెలుస్తోంది.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసిన దానికన్నా యూరియా వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇదే సమయంలో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ఎక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు యూరియాను అమ్ముకున్నారు. మరికొంత మంది హోల్‌సేల్ డీలర్లు యూరియా కావాలంటే గుళికలు, లేదా జింక్ కొనాలని పట్టుబడుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడమే ప్రస్తుత యూరియా కొరతకు కారణమని పలువురు విమర్శిస్తున్నారు. రైతులకు ఇస్తున్న రాయితీని ఎత్తి వేసేందుకు యూరియా కొరతను సృష్టిస్తున్నారని అంటున్నారు. 45 కిలోల యూరియా బస్తాకు రూ. 350 నుంచి రూ.500 చెల్లించి బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతన్నలు వాపోతున్నారు. తప్పక బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.

అవసరం మేరకు అందిస్తున్నాం



సాగుకు అవసరమైన యూరియాను సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్నాం. ప్రభుత్వం 45 కిలోల బస్తాను రూ.266.50కు అందిస్తోంది. కోరుకొండ సబ్ డివిజన్‌లోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్నాం. అలాగే రైతన్నలు అవసరం మేరకే ఎరువులు కొనాలి. రెండో పంట కోసం ఆలోచించి, అధికంగా తీసుకోవద్దు.

–జె.శశిబిందు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, కోరుకొండ

రైతన్నలకు ప్రాధాన్యమేదీ!



రాష్ట్రాన్ని మద్యం విక్రయ కేంద్రంగా మార్చిన కూటమి ప్రభుత్వం, రైతన్నల కోసం ఆలోచించడం లేదు. సీఎం చంద్రబాబు వ్యవసాయాన్ని దండగ అనేట్లు మార్చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతులకు మేలు జరిగేలా చేశారు. ఈ ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు పంపి రైతులకు నష్టాలు తెస్తోంది.

–నక్కా రాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



డాక్టర్ బాబుకు స్వీటు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్ర వలంటీర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఎంపికైన సీతానగరానికి చెందిన పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు)ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం సీతానగరంలో సన్మానించారు. డాక్టర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా, ఆత్మ చైర్మన్‌గా, తూర్పుగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా సేవలు అందించానన్నారు. పార్టీ అందించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాష్ట్ర వలంటీర్స్ వింగ్ ప్రెసిడెంట్ నాగార్జున యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు సీనియర్ అసిస్టెంట్ బీవీవీఎస్ రామాంజనేయులు తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికతో తప్పక రావాలన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



సంపరలో అద్దంకి ముక్తేశ్వరరావుకు అభినందనలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- శ్రేణులు ఉత్సాహంగా పనిచేయండి
- నియోజకవర్గాల పరిశీలకుడు ముక్తేశ్వరరావు

పెదపూడి: వైఎస్సార్ సీపీ శ్రేణులు నూతన ఉత్సాహంతో పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గోపాలపురం, రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సంపర గ్రామంలో ఇటీవల రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడిగా నియమితులైన ఆయనను వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్కరించారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ తనను రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు నూతన ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే నాయకులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే వరకూ కష్టపడి పనిచేస్తానని ప్రకటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నల్లమిల్లి విజయరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నాగుమళ్ల వీరభద్రరావు, మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, యువనేత కొటికలపూడి గణేష్, సమ్మంగి దుర్గాప్రసాద్, వాసంశెట్టి మాధవ, కర్రెడ్ల వెంకన్నబాబు, సుందరపల్లి వీరభద్రం, మార్ని కామరాజు చౌదరి, గుండా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన లేని విధులు మాకొద్దు



పెదపూడిలో ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతి అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



బిక్కవోలులో ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు



సీతానగరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మూర్తికి వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

- 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించండి
- సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ సూచన

పెదపూడి: సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని పెదపూడి మండల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అసోసియేషన్ కోరింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖకు అప్పగించాలని కోరారు. కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బిక్కవోలులో..

తమకు పని భారం తగ్గించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌కు బిక్కవోలు మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, తమకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: సచివాలయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘ జిల్లా కో కన్వీనర్ బాలరజనీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎండీఓ కేవీఎస్ఎస్ మూర్తికి సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి మండలంలోని సచివాలయ ఉద్యోగులు తరలివెళ్లి తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలంటూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాల రజనీ మాట్లాడుతూ ఇంటింటా సర్వేలు, ఇతర అదనపు పనులను సచివాలయ ఉద్యోగులతో చేయించడం సరికాదన్నారు. పది గంటల పనివేళల నిబంధన అమలు చేయకపోవడం, సెలవు రోజుల్లో పని చేయమనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు శశికళ, సురేంద్ర, సత్య సీతాదేవి, సాయి మాదవ్, బషీర్, సాయి మనోజ్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక







రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విమల, లీలాస్వాతి, వై.చిన్ని, జక్కల సంతోష్

అనపర్తి: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ ఎం.రాజు తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన అండర్– 19 విభాగ పోటీలో సీనియర్ ఎంపీసీ విద్యార్థి జక్కల సంతోష్, జూనియర్ బైపీసీ విద్యార్థి వై.చిన్ని ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరితో పాటు తర్ఫీదు ఇచ్చిన పీడీ సతీష్‌రాజును ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి అండర్–19 చెస్ పోటీలకు పందలపాక జెడ్పీ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజేత విద్యార్థులు జి.విమలశ్రీ, పి.లీలాస్వాతిలు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ డి.యువరాజారెడ్డిని ఆయన అభినందించారు.

వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా శ్రీను



పెదపూడి: వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన నిడదవోలు శ్రీనును నియమించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. నిడదవోలు శ్రీనుకు నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం: కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ: జిల్లాలో టోకెన్ విధానం ద్వారా ప్రతి రైతుకు యూరియాను సరఫరా చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శ్రీరంగపట్నం ప్యాక్ సొసైటీలో గురువారం రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఎరువుల వాడకంలో శాస్త్రీయ విధానాలను అనుసరించి యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం రైతులు ఎకరానికి 4– 5 బస్తాల యూరియాను వాడుతున్నారన్నారు. వాస్తవానికి 50 నుంచి 60 కిలోలు మాత్రమే మూడు దశల్లో వినియోగిస్తే సరిపోతుందన్నారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గడంతో పాటు పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సొసైటీ చైర్‌పర్సన్ కేఎస్‌వీ గణపతిస్వామి, రైతులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు

పెదపూడి: పైన గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎరువుల విక్రయ నిధులు దుర్వినియోగం అయినట్లు ఆ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి గురువారం కాకినాడలో డివిజన్ సహకార శాఖ డీఆర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు పీఏసీఎస్‌లో ఎరువులు ఉన్నట్లు రికార్డుల్లో చూపించి.. ఆర్థిక సంవత్సరం చివరిలో వాటిని విక్రయించారన్నారు. ఆ విక్రయించిన సొమ్మును రైతులు చెల్లించాలంటూ ఆడిట్ రిపోర్టులో చూపించారని ఆరోపించారు. వారు నిజమైన రైతులా లేక బినామీలా అనేది విచారణ చేపట్టాలని కోరారు. రైతులకు చెందాల్సిన ఎరువులను బయట మార్కెట్లో సుమారు రూ.13,30,00కు విక్రయించి, ఆ సొమ్ములు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. దీనిపై సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని తెలిపారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

రాజానగరం: ఉద్యోగుల భవిష్యత్తు నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా అందిస్తున్న పీఎఫ్ సేవలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం రీజినల్ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈపీఎఫ్ఓ, ప్రధాన మంత్రి వికిసిత్ భారత్, రోజ్‌గార్ యోజనపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. పీఎఫ్ ద్వారా ధనాన్ని పొదుపు చేసుకోవడంతో పాటు బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయన్నారు. యూనివర్సిటీలో ఉద్యోగులంతా ఈపీఎఫ్ఓలో భాగస్వాములై, తద్వారా కలిగే ప్రయోజనాలను అందుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



శారదాజ్యోతి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ సుమ తదితరులు

బిక్కవోలు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు దానికదే వస్తుందని ఎంపీపీ తేతలి సుమ అన్నారు. ఇళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.శారదాజ్యోతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఇటీవల అవార్డు పొందారు. ఆమెకు ఆ పాఠశాలలో గురువారం హెచ్ఎం పప్పు శ్రీనివాసురెడ్డి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శారదాజ్యోతి విద్యార్థుల ఉన్నతికి, పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం అవార్డు గ్రహీత, ఆమె భర్తకు శాలువా కప్పి సత్కరించారు. నాయకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పందలపాకలో అన్నసమారాధన

బిక్కవోలు: వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పందలపాక గ్రామ వినాయకనగర్ కాలనీలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. వినాయక మండపం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంతో పాటు కొంకుదురు, కొమరిపాలెం, పందలపాక, తొస్సిపూడి గ్రామాల నుంచి భారీగా భక్తులు వచ్చి స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

అమరవీరులను స్మరించుకుందాం



అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

రాజానగరం: అటవీ సంపదను కాపాడడంలో ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. లాలాచెరువులోని మహా పుష్కరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అమరవీరుల స్థూపాల వద్ద పలువురు అటవీశాఖ అధికారులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్, డీఎఫ్ఓ వి.ప్రభాకరరావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధి శ్రీనివాస్, స్టేట్ సిల్వికల్చరిస్ట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ దావీదురాజు నాయుడు, డిప్యూటీ రేంజర్ చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి



జనానికి చిక్కిన యువకుడు

రాజానగరం: బైక్‌ను అపహరించబోయి జనం చేతికి చిక్కిన ఓ యువకుడికి దేహశుద్ధి చేశారు. గురువారం మధ్యాహ్నం తూర్పుగానుగూడెంలో ఓ టీ స్టాల్ వద్ద పార్కు చేసి ఉన్న బైకులను గుర్తు తెలియని ముగ్గురు వచ్చి అపహరించే ప్రయత్నం చేశారు. దానిని గమనించిన స్థానికులు వారిని పట్టుకోబోగా ఇద్దరు తప్పించుకుపోయారు. పట్టుబడిన మూడో యువకుడికి దేహశుద్ధి చేసి, స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా ఈ యువకులు గోకవరానికి చెందిన వారిగా తెలుస్తుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తల్లీ పిల్లల అదృశ్యం

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమూరుకు చెందిన వివాహిత శిరీష తన ఇద్దరు పిల్లలు జైదీప్ వీర (4), మోక్షశ్రీ వీర (1)తో సహా కనిపించడం లేదని ఆమె భర్త ఆకాశపు మోహన్‌కుమార్ గురువారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్ ఫోన్ మాట్లాడవద్దని మందలించినందుకు ఎవరికీ చెప్పకుండా పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.ప్రియకుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 83284 68687, 94407 96585, 94410 23561 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.